


# ఈ కథ సుఖాంతం చేయరూ?

## గుడిపేన సుందర రామయ్య

ఆ రోజు ఏప్రిల్ ఫస్టు—

విజయవాడ బస్సుస్టాండు చేరుకొనేసరికి గుంటూరు—మచిలీపట్నం ఫాస్ట్‌పాసెంజరు సిద్ధంగా వుంది. నాన్ స్టాప్ గురించి అడిగితే అంతకు మునుపే వెళ్ళిపోయిందన్నారు. ఇంకో గంట వెయిట్ చేసేబదులు ఫాస్ట్ పాసెంజర్‌లో వెళ్లటమే మంచి దన్పించింది. నేను బస్సులోకి అడుగుపెట్టేసరికి ముందు సీట్లన్నీ నిండిపోయి వున్నాయి. వెనుక సీట్లలో కూర్చోవాలంటే నాకు తగని చిరాకు. అయినా తప్పలేదు. ఇంకొకప్పుడైతే ఎలా వుండేదో కాని ఈసారి మాత్రం నాకు చిరాకు అన్పించలేదు. కారణం నా వెనుక సీట్లోకూర్చున్న 'మెరుపు తీగ'ని మీరు గట్టిగా అన్నా నేను కోపగించుకోను సరికదా నవ్వుతూ 'కరెక్ట్' అంటాను.

గులాబీ రేకుల్లాంటి చెక్కిళ్ళు— కలువరేకుల్లాంటి కళ్ళు — దానిమ్మగింజల్లాంటి పళ్ళు — సంపెంగ పువ్వులాంటి నాసిక.

పాత కథల్లో చదివిన వర్ణన గుర్తుకు వచ్చింది ఆమెను చూడగానే.

వెనక్కి తిరిగి చూడటం సభ్యతగా వుండదేమో నన్న భయంతో బస్సు ఎక్కి పావుగంట దాటినా వెనక్కి తిరిగి చూడలేకపోయాను.

ఆమెను మరోసారి చూడటం ఎలా అని ఆలోచిస్తున్న నాకు మెరుపులా ఓ ఆలోచన వచ్చింది.

చేతిలోవున్న బ్రీఫ్‌కేసును పైనపెట్టే మిషతో లేచి నిలబడి ఆమెవైపు చూశాను.

ఆమె ఓరకంట నా చూపులతో చూపులు కలిపింది. ఆ చూపులు నా గుండెలో పూలవర్షం కురిపించాయి. ఎంత అందమైన చూపు!

ఆమెలో 'అందం' వుంది. 'ఆకర్షణ!' వుంది. అంతకుమించిన 'అణుకువ' కన్పించింది.

ఉన్నతమైన నుదురు — ఆ నుదుటిమీద మెరుస్తున్న దోసగింజంత తిలకం! ఆ తిలకాన్ని ముద్దు పెట్టుకోటానికి ప్రయత్నిస్తున్న నల్లని కురులు.

బస్సు క్రమేపీ వేగాన్ని పుంజుకొంది.

అప్పుడప్పుడు అవకాశం చూసుకొని ఆమెవైపు చూస్తూనేవున్నాను. ఆమె కూడా నన్ను క్రీగంట చూస్తూనేవుంది. వేయి వసంతాల హాయిని స్ఫురింపజేసే ఆ చూపులను చూస్తుంటే ఎప్పుడో ఎక్కడో చూసినట్లుగా అనుభూతి చెందాను. కాని ఎంత ఆలోచించినా ఆ చూపును ఎక్కడ చూశానో గుర్తుకు రావటంలేదు...

బస్సు కంకిపాడులో ఆగింది —

'మెరుపుతీగ' సపోటాపళ్లను బేరం చేస్తూంది. నాక్కూడా కొనాలన్పించింది.

ప్యాంటు జేబులోంచి పర్సు తీశాను. అంతకు ముందు రోజే జీతం తీసుకొని బయల్దేరటంచేత నా పర్సు పున్నమినాటి చంద్రునిలా నిండుగా వుంది. అందులోంచి అర్ధరూపాయి బిళ్లను బయటకు తీశాను. అంతలోనే బస్సు కదిలింది.

"ఏమమ్మో! డబ్బులు! డబ్బులు!" అంటూ పళ్లవాడు కేకలేస్తున్నాడు బస్సుతోపాటు పరుగు తీస్తూ.

"రెండ్రూపాయల చిల్లర వుందా?" అని అడుగుతూంది మెరుపుతీగ.

"అర్ధరూపాయివ్వు! లేదా పళ్లు యివ్వు!" అంటూ పళ్లవాడు బస్సును గుద్దుతూ పరుగులు తీస్తున్నాడు.

నేను వెంటనే చేతిలో వున్న అర్ధరూపాయిని బయటకు విసిరాను.

"థాంక్సండి!" అంటూ రెండు రూపాయల నోటును నా కివ్వబోయింది.

"ఫర్వాలేదు! ఉంచండి! నా దగ్గరకూడా చిల్లర లేదు!"

"ఏమిటోనండి! వీళ్లకు బొత్తిగా మేనర్స్ తెలీదు! అమ్మేవాడి దగ్గర చిల్లర వుంచుకోవద్దూ!" అంటూ నా పర్సువైపు చూసింది ఆమె.

"అంతా నాటకమండి! వాడిదగ్గర చిల్లర లేకకాదు! బస్సు బయల్దేరాక నోట్లు తీసుకొని చిల్లర ఎగ్గొట్టటం వీళ్లకు అలవాటు!" అన్నాను నేను ఏదో సత్యం చెప్తున్నవాడిలా పోజుపెట్టి.

"నిజం చెప్పారు!" అంటూ కిలకిలా నవ్వేసి చేతిలో వున్న రెండు సపోటాపళ్లను నా కందివ్వబోయింది.

"థాంక్స్! వద్దండి!" అన్నాను మొహమాటంగా.

"ప్లీజ్! తీసుకోండి!" అంది కొంటెగా నవ్వుతూ.

"థాంక్సండి!" అంటూ ఆమె చేతిలోని పళ్లను అందుకొన్నాను. అనుకోకుండా తగిలిన ఆమె చేతి స్పర్శ విద్యుత్‌లా మారి నా శరీరంలో ప్రవహించింది.

ఆ సమయంలో ముందు కూర్చున్న ముగ్గురు కుర్రాళ్ళు వెనక్కితిరిగి మా వైపు వెర్రి చూపులు చూడటం, ఓ బామ్మగారు ముక్కుమీద వ్రేలేసుకోటం, రెండు బట్టతలలు బుర్రలు గోక్కోటం నేను గమనించకపోలేదు.

ఉయ్యూర్లో బస్సాగింది —

డ్రైవర్, కండక్టరు కాఫీకి దిగటం చూసి నేను కూడా క్రిందికి దిగాను.

హోటల్లో కాఫీ త్రాగుతున్నానన్న మాటేకాని మనసంతా ఆ మెరుపుతీగ చుట్టూ తిరుగుతూంది. ఈ టైమ్‌ కూడా ఆ ముఖారవిందాన్ని తిలకించటానికి కేటాయిస్తే బాగుండేది అంది నాలోని కవి హృదయం. మనిషిని పిచ్చివాణ్ణి చేసేది ఆడదాని

అందమొక్కటేనన్పించింది. కాకపోతే ఏమిటి? ఆడదాని ముఖాన్ని పరిశీలనగా చూసే ధైర్యం కూడా లేని నేను (ఇది మా శేఖర్‌గాడి కామెంట్) ఈ అమ్మాయి వ్యామోహంలో పడిపోవటం, ఏవేవో మధురమైన ఊహలను ఊహించుకోవటం ఆశ్చర్య పడాల్సిన విషయమే!

కాఫీ త్రాగి బస్సెక్కాను. మెరుపుతీగ మల్లెపూలు కొంటూంది.

'కొంపతీసి వీటిక్కూడా నేనే డబ్బులివ్వాలా?' అనుకొంటూ సీట్లో కూర్చున్నాను. నిజంగా అంత అదృష్టమా? ఓ అందమైన అమ్మాయికి మల్లె పూలను కొనిచ్చే అదృష్టం అందరికీ కల్గుతుందా?

జేబులోంచి పర్సుతీశాను చిల్లర తీయటానికి.

"ఇదిగో మీ అర్ధరూపాయి!" అంటూ ముందుకు వంగి చిల్లర నాణాన్ని నా చేతిలో వుంచింది.

"మల్లెపూలకు చిల్లర ఇద్దామని పర్సుతీశాను!" అన్నాను పర్సును ఆమెకు చూపిస్తూ.

"థాంక్స్! మల్లెపూలబ్బాయి చిల్లర ఇచ్చాడు!" అంది నా పర్సువైపు చూస్తూ.

డ్రైవర్ కడుపులో కాఫీ పడటంచేత కాబోలు బస్సు మంచి జోరుగా పరిగెత్తుతోంది.

మరో సమయంలో అయితే అతగాడి స్పీడుకు అభివందనం చేసి పద్మశ్రీ బిరుదును ఇచ్చి వుండే వాణ్ణి! కాని ప్రస్తుత సమయంలో అతనిమీద మా చెడ్డ కోపం వచ్చింది. ఎవడో తరుముకొస్తున్నట్టు అంత కంగారుగా ఎందుకు తోల్తున్నావురా బాబూ అంటూ విసుక్కొన్నాను. ఎలక్షన్స్ వచ్చే ముందు పాత మినిస్టర్‌గారి గుండెల్లో ఏర్పడే దడలాంటిదేదో నా హృదయంలో ప్రారంభమైంది. ఇతగాడు ఇదే స్పీడులో వెళ్తే అరగంటలో బందర్లో వాల్తాడు. అంటే మెరుపుతీగతో మధురక్షణాలు ఇంకో అరగంటలో అంతమవుతాయన్న మాట! 'ఈ బస్సు హఠాత్తుగా చెడిపోతే బాగుండు!' అనుకొన్నాను మనసులో. కాని అదేం విచిత్రమో కాని ఉన్నకొద్దీ బస్సు వేగాన్ని పుంజుకొంటోంది.

బయట్నుంచి వెచ్చటి గాల్పు వస్తోందని గాజు తలుపులను క్రిందికి దించుతున్నారు కొందరు కాని నాకు మాత్రం బయట్నుంచి వీస్తున్న గాలి ఎంతో చల్లగాను, హాయిగాను వుంది. అందుక్కారణం నా వెనుకనున్న అందాలరాశి అని మీరన్నా నేను అభ్యంతరం చెప్పను సుమా!

నాకు తెలియకుండానే మెల్లగా కళ్ళు మూతలు పడ్డాయి. కళ్ళముందు ఏదో రంగు రంగుల వలయాలు గిర్రున తిరుగుతున్నాయి. హీరో హీరోయిన్ డ్రీమ్ సీక్వెన్స్‌కు వేసిన సెట్టులాంటి దృశ్యం. అందులో రాజకుమారుడి వేషంలో గాల్లో తేలుతూ వస్తున్న నాకు ఎదురుగా మెరుపుతీగ రాకుమార్తె వేషంలో నాజూకుగా గాల్లో తేలుతూ వస్తూంది.

ఆమె చేతిలో విలువైన గులాబీమాల. ఎరుపెక్కిన చెక్కిళ్ళతో, మిలమిల మెరిసే కళ్ళతో నన్ను సమీపించింది. చేతిలో వున్న పూలదండను నా మెడలో వేసి పాదాభివందనం చేసింది. ఆ సమయంలో పైనుంచి మామీద పూలవర్షం కురిసింది. నేను ఆనందపారవశ్యంతో ఆమెను హృదయానికి హత్తుకొన్నాను.

"ఏమండోయ్! సరిగ్గా కూర్చోండి!" అన్న మాట వినగానే ఉలిక్కిపడ్డాను. కళ్ళు తెరిచి చూశాను. నా తల ముందు సీటుపైకి వాలివుండటం చేత ఆ సీటు తాలూకు వ్యక్తి వార్నింగ్ యిచ్చిన విషయం గ్రహించాను. కల కరిగిపోయింది. రంగుల సినిమా చెదిరిపోయింది. వర్తమానంలోకి వచ్చాను.

బస్సు పామర్రులోకి అడుగుపెట్టింది —

"ఈ పర్సు మీదేనా?" వెనుకనుంచి వీణా రవం విన్పించేసరికి వెనక్కి తిరిగాను.

"అరే! మీ దగ్గరకెలా వచ్చింది?" ఆశ్చర్యంగా అడిగాను.

"మీ సీటు కింద పడుంది!" మెరుపుతీగ సమాధానం.

"థాంక్సండీ!" అంటూ ఆమెవైపు చూస్తూనే జేబులో పెట్టుకొన్నాను పర్సు.

"వస్తానండి!" అంటూ బ్యాగ్ పుచ్చుకొని ఆ అమ్మాయి బస్సు దిగటానికి సిద్ధమయ్యేసరికి ఆశ్చర్యపోయాను.

"మీరు బందరు రావటంలేదా?" నీరసంగా అడిగాను.

"టిక్కెట్టు బందరుకే తీసుకొన్నాను. కాని మా ధనలక్ష్మి గుర్తుకు వచ్చింది. ఆమె ఇక్కడే టీచర్‌గా పని చేస్తూంది!"

'బందర్లో ఎక్కడుంటున్నారు? మీ పేరేమిటి?' వగైరా ప్రశ్నలు వేయమని మనసు తొందరపెట్టినా అప్పటికే ఎన్నో జతల కళ్ళు మా వైపు పరిశీలనగా చూస్తున్నాయన్న విషయం స్ఫురించి ఆ ప్రయత్నం మానుకొన్నాను.

బస్సు కదిలింది.

నా మనసులో అసంతృప్తి, అసహనం చోటు చేసుకొన్నాయి. చూసీ చూడటంతోనే మెరుపుతీగ నన్నాకర్షించింది. 'జీవిత పర్యంతం ఇలాంటి అందగత్తెతో ప్రయాణం చేస్తే బాగుండును' అనే కోరిక మనసులో కల్గింది సినిమాల్లో జరిగినట్లు నేను పెళ్ళిచూపులు చూడబోయే చిన్నది కూడా ఈ మెరుపుతీగే అయితే ఎంత అదృష్టం? అసలు నేను చూడబోయే పిల్ల ఇంత అందంగా వుంటుందో లేదో? ఇంత మధురంగా మాట్లాడుతుందో, లేదో? ఇంత కొంటెగా నవ్వుతుందో, లేదో? నాన్నగారు పెళ్ళికూతురి వివరాలు పూర్తిగా రాయలేదు. అమ్మాయి గుంటూర్లో పాలిటెక్నిక్ చదువుతోందని బందర్లో మేనమామగారింటి వద్ద పెళ్ళిచూపులు ఏర్పాటు చేశామని మాత్రమే వ్రాశారు.

అంతేకాని! అమ్మాయి రూపురేఖల గురించి, గుణగణాలను గురించి వ్రాయలేదు. ఆయనక్కావాల్సింది కట్నం! పిల్ల ఎలా వున్నా ఆయనకు అనవసరం!

ఆలోచనల్లోపడి బస్సులో కూర్చున్నానన్న విషయాన్నే మర్చిపోయాను.

బస్సు బందరు కోనేటి సెంటర్లో ఆగింది.

బస్సు దిగి రిక్షా ఎక్కాను.

ఇంటిముందు రిక్షా ఆగగానే ఇంట్లో వాళ్ళందరు ఆత్రంగా బయటకు వచ్చారు.

అందర్నీ నవ్వుతూ పరామర్శిస్తూనే జేబు లోంచి పర్సు తీశాను.

ఆశ్చర్యం!

పర్సు ఖాళీగా వుంది.

కంగారుగా డబ్బులు కోసం జేబులు వెతుక్కోవటం చూసి "ఏమైందిరా?" అని అడిగింది అమ్మ.

నా కంగారును కప్పిపుచ్చుకొంటూ "డబ్బు రూమ్‌లో మర్చిపోయి వచ్చానమ్మా!" అన్నాను.

"పెట్లోనే పెట్టావా, లేక బయట పడేశావా? అసలే నీకు మతిమరుపు జాస్తి!" అమ్మ మందలిస్తూ అడిగింది.

"పెట్లోనే పెట్టాను కాని రిక్షా అబ్బాయికి ముప్పావలా యిచ్చి పంపించు!" అంటూ బ్రీఫ్‌కేసు పుచ్చుకొని లోపలికి వచ్చాను.

ఆ సాయంత్రమే పెళ్ళివారింటికి బయల్దేరాం. పెళ్ళిచూపుల హడావుడిలో అందరూ ఆనందంగాను, సరదాగాను వున్నారు. కాని నా మనసు ఎంతో దిగులుగా వుంది. జీవితంలో ఎన్నడూ ఇలాంటి దెబ్బ తినలేదు. ఓ ఆడదాని చేతిలో మోసపోయాను. అందుకే అంటారు 'మెరిసేదంతా బంగారం కాదు!'

రిక్షా ఓ ఇంటిముందు ఆగగానే బావయ్యతో పాటు నేనుకూడా దిగాను. అమ్మ, అక్కయ్య, నాన్న అందరూ రిక్షాలు దిగారు.

పెళ్ళివారు మాకు స్వాగతం చెప్పి ఇంట్లోకి తీసికెళ్ళారు. కాఫీ ఫలహారాలు పూర్తయ్యాక పెళ్ళికూతుర్ని బయటకు తీసుకొచ్చారు.

తలవంచుకొని ఆలోచిస్తున్న నన్ను ప్రక్కనున్న బావయ్య గిల్లి "పెళ్ళికూతురు వస్తూంది!" అన్నాడు. తలెత్తి చూశాను.

ఇద్దరాడవాళ్ళ మధ్య తలవంచుకొని వస్తున్న ఆడపిల్ల కన్పించింది.

దగ్గరకు వచ్చాక తలెత్తి నా వైపు చూసిందా అమ్మాయి.

అంతే!

నేను తెల్లముఖం వేశాను.

ఆమె మరెవ్వరో కాదు. "మెరుపుతీగ!"

* * *

ఈ కథకు ఇంతటితో ముగింపు జరిగి వున్నట్లయితే ఏదో విలువైన దానిని పోగొట్టుకొన్నా నన్న అసంతృప్తి నా హృదయంలో మిగిలివుండేది కాదు! జీవితాంతం నెమరు వేసుకోటానికి మధుర స్మృతి లభ్యమయ్యేదికాదు!

నేను విజయవాడ వచ్చిన మర్నాడే "మీకో మనియార్డర్ వుందిసార్!" అంటూ పోస్టుమాన్ చెప్పాడు. నేను ఆశ్చర్యపోయాను. సాధారణంగా ఎమ్.ఓ.లు నా దగ్గర్నుంచి వెళ్తాయి కాని నాకు వచ్చేవి వుండవు. కథలు అచ్చయితే తప్ప! ఈమధ్య అచ్చయిన కథ కూడా ఏమీ లేదు. ఎక్కడ మంచి వచ్చివుంటుందా? అనుకొంటూనే ఎమ్. ఓ. ఫారమ్ తీసుకొని అడ్రసు చూశాను.

'మిస్. అనుపమ ...'

"అన్నాయ్! వదినపేరు అనుపమట! పేరు బావుంది కదూ!" బందర్లో పెళ్ళిచూపులకు వెళ్తున్న నాతో చెల్లాయి అన్నమాటలు గుర్తుకు వచ్చాయి.

# ఈ కథ సుఖాంతం చేయరూ?

కథ అర్థమైంది. నా పర్సులో దొంగతనం చేసిన డబ్బు మొత్తం ఎమ్.ఓ. చేసింది. ఈ రకంగా తన నిజాయితీని ప్రదర్శించుకొని నా భార్య అయ్యే అదృష్టాన్ని కోరుకొంటోంది కాబోలు! సంతకం చేసి డబ్బు తీసుకొన్నాను.

మర్నాడే పోస్టులో నాకో ఉత్తరం వచ్చింది. కవరుమీద అనుపమ పేరు కన్పడగానే కంగారుగ విప్పి చదివాను—

"ఆనందరావుగారికి,

నమస్సులు! జరిగిన సంఘటనకు నేనెంతో చింతిస్తున్నాను. ఈపాటికి మీ మనసులో నేనొక దొంగగా ముద్రపడి వుంటాను. కాని ఏ పరిస్థితుల్లో నేనలా ప్రవర్తించాల్సివచ్చిందో మీకు తెలియజెప్పి నామీద మీరు ఏర్పరచుకొన్న అపోహను తొలగించి జరిగినదానికి మిమ్మల్ని క్షమాపణ కోరుకోవటమే ఈ ఉత్తరం లక్ష్యం!

ఈ రోజుల్లో వరకట్న పిశాచి ఆడపిల్లల తల్లిదండ్రులను ఏ రకంగా పీడిస్తోందో మీకు తెల్సు. నా తర్వాత పెళ్ళికి ముగ్గురాడపిల్లలున్నారు. అందుకనే నా పెళ్లి విషయంలో తొందరపడి సంబంధాలు చూశారు మావాళ్ళు. ఇప్పటికి ఐదారు సంబంధాలు కట్నం కుదరకపోవటంచేత నా అదృష్టం కొద్దీ తప్పిపోయాయి. అదృష్టమని నేను అనటం మీకు ఆశ్చర్యాన్ని కల్గిస్తోంది కదూ? అందు క్కారణం ఉత్తరం పూర్తిగా చదివితే మీకే అర్థమౌతుంది. మీరు పెళ్లిచూపులకు వస్తున్నారనగానే నేనెంతో భయపడ్డాను. ఈ పెళ్లి జరుగుతుందని భయం వేసింది. మీ తల్లిదండ్రులకు కట్నం అవసరమైనా మీరు మాత్రం అందుకు వ్యతిరేకిస్తారని నాకు తెలుసు. మీ మనసు గురించి ఎలా తెల్సిందని ఆశ్చర్యపోతున్నారా? మీరు రచయిత! ఆదర్శభావాలను పదిమందికీ చెప్పే బోధకులు! మీ కథల్లో మీరు రాస్తున్న ఆదర్శాలను మీరు తప్పకుండా పాటిస్తారని నా గట్టి నమ్మకం! మీరు నా పట్ల అయిష్టత చూపటానికి గల మార్గాలను ఆలోచించాను. అంతే! బస్సులో మీ పర్సులోని డబ్బు దొంగిలించాను. ఈ దొంగతనం మీరు బస్సు దిగకముందే బయటపడ్తే కథ అడ్డం తిరుగుతుందనే భయంతో స్నేహితురాలి దగ్గరకు వెళ్తున్నానని అబద్ధం చెప్పి పామర్రులో దిగిపోయి మరో బస్సు ఎక్కాను. నన్ను చూడటానికి వస్తున్నది మీరేనని ఎలా గుర్తుపట్టకల్గానా అని మీకు అనుమానం రావచ్చు! మీరు నా అభిమాన రచయిత! నిజం చెప్పాలంటే నేని నాటకం ఆడటానికి ధైర్యాన్నిచ్చింది పరోక్షంగా మీ కథలే! మీ కథలన్నీ నేను విడువకుండా చదువుతాను. దీపావళి పోటీల్లో మీ కథకు ప్రయిజు వచ్చిన సందర్భంలో లోకల్ లైబ్రరీలో మీకు సన్మానం జరిగింది కదా! ఆ సందర్భంలో ఓ ప్రేక్షకురాలిగా మిమ్మల్ని చూశాను. మీరు బస్సు ఎక్కగానే మిమ్మల్ని గుర్తుపట్టాను. నాకు శ్రమ నివ్వకుండా నా ముందు సీట్లోనే మీరు కూర్చున్నారు.

ఈ ఉత్తరం చదివి నన్ను క్షమించి నన్ను పెళ్లి చేసుకోవాలన్న నిర్ణయం మాత్రం మీరు దయచేసి తీసుకోవద్దు. నేను శేఖర్‌ను ప్రేమించాను. శేఖర్ గుంటూర్లో స్టేట్ బ్యాంకులో పనిచేస్తున్నాడు. అతను కూడా నన్ను ప్రేమించాడు. అయితే మా పెళ్లికి ఓ అడ్డంకు వుంది. శేఖర్‌వాళ్ల అక్కయ్యకు ఇంకా పెళ్లికాలేదు. ఆమె పెళ్లయిన తర్వాత నన్ను చేసుకొంటానన్నాడు. అప్పటివరకు ఏదో మిషతో పెళ్లిని వాయిదాలు వేయమన్నాడు. శేఖర్ విషయం మా వాళ్లకు చెప్పే ధైర్యంలేక నేనే ఇంతవరకు నా పెళ్లికి వాయిదాలేసుకొంటూ వచ్చాను. ఈ రోజునే శేఖర్ నుంచి వుత్తరం వచ్చింది. వాళ్లక్కయ్యకు పెళ్లి నిశ్చయమైనదట. త్వరలో అతని పెద్దవాళ్ళు వచ్చి మా వాళ్లతో మా పెళ్లి విషయం మాట్లాడుతారట.

నేను మిమ్మల్ని ప్రార్థించేది ఒకటే! నేను నచ్చలేదని మా వాళ్లకు వుత్తరం వ్రాయండి! వెయ్యి అబద్ధాలు చెప్పయినా ఓ పెళ్లిని చేయమన్నారు పెద్దలు! మీరు మీ కథల ద్వారా ఎన్నో నగ్నసత్యాలను మాలాంటి పాఠకులకు అందించారు. ఈసారి ఈ ఒక్క అబద్ధం ఉత్తరం ద్వారా మా వాళ్లకు వ్రాసి మా ప్రేమ కథను సుఖాంతం చేయరూ?

మీ అభిమాన పాఠకురాలు,

అనుపమ."

* * *

ఏప్రిల్ ఫస్టు వచ్చినప్పుడల్లా ఇప్పటికీ ఆ ఉత్తరాన్ని పదేపదే చదువుకొంటాను. (మా శ్రీమతి అన్నపూర్ణ చూడకుండా సుమండీ!)